క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

సనత్‌నగర్: రాంగోపాల్‌పేట, బేగంపేట డివిజన్లలో పలు అభివృద్ధి పనులను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం ప్రారంభించనున్నారు. ఉదయం 9.30 గంటలకు రాంగోపాల్‌పేట డివిజన్‌లో రూ.40.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, కళాసీగూడ ప్రభుత్వ పాఠశాల వద్ద రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, కామాక్షమ్మ టెంపుల్ వద్ద రూ.3.50 లక్షలతో సీవరేజ్ పైప్‌లైన్ పనులు, పాన్‌బజార్‌లోని జైన్ టెంపుల్ వద్ద రూ.10 లక్షలతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ పనులు, సిటీలైట్ సమీపంలో రూ.10 లక్షలతో రెండు ప్రాంతాల్లో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు, బేగంపేట డివిజన్‌లోని పైగా ప్యాలెస్ వద్ద రూ.23.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించనున్నారు.

పరామర్శ



మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: డివిజన్లోని అంబర్‌నగర్ ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు ధన్‌రాజ్ గురువారం గుండెపోటుతో మరణించాడు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. శుక్రవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

దివ్యాంగులకు అన్నదానం



సనత్‌నగర్: బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాల విద్యార్థులకు త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. న్యాయవాది బాల్‌రాజ్ సేవా కార్యక్రమాల ద్వారా వారికి ఆపన్నహస్తం అందించారు. సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృతం చేసేలా త్రినేత్ర ఫౌండేషన్‌ను నెలకొల్పారు. ఈ క్రమంలో బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో 450 మంది విద్యార్థులకు వివిధ వంటకాలను వడ్డించారు. ఫౌండేషన్ సభ్యులు భారతి, వైద్యులు వేణు, సాయి సుధాకర్, వేణుగోపాల్ ఉన్నారు.

విజయవంతంగా ముగిసిన స్వస్థత సభలు



సువార్త ఆశీర్వాదాలు ప్రకటిస్తున్న పాస్టర్ జాయ్, జమీమ్మలు

చిలకలగూడ: హోసన్నా పెంతికోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన స్వస్థత సభలు విజయవంతంగా ముగిశాయి. హెచ్‌పీఎఫ్‌ఎమ్ వ్యవస్థాపకులు పాస్టర్ డేవిడ్‌రాజ్, రెబకమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాస్టర్ జెబ్‌రాజ్, జాకబ్ ఛార్లెస్, మాథ్యూస్, స్వస్థత సభ నిర్వాహకులు పాస్టర్ జాయ్, జమీమ్మలు ముఖ్య అతిథులుగా హాజరై మతవిశ్వాసకులకు సువార్త, వర్తమానం, దీవెనలు అందించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాయ్ మాట్లాడుతూ ప్రపంచ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనే స్వస్థత సభలు నిర్వహించినట్లు తెలిపారు.

హాస్టల్‌లో వాచ్‌మెన్ సోదరుడి ఆత్మహత్య

కంటోన్మెంట్: ప్రభుత్వ గిరిజన వసతి గృహంలో పనిచేసే అన్న స్థానంలో తాత్కాలికంగా విధుల్లో చేరిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల మేరకు జనగామ జిల్లా చిల్పూరు మండలం లింగంపల్లికి చెందిన సంపత్ బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడి సోదరుడు సతీష్ ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాసముంటూ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న సంపత్ స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు సొంతూరుకు వెళ్లాడు. తాను తిరిగి వచ్చేంత వరకు వసతి గృహంలో వాచ్‌మెన్‌గా బాధ్యతలు చూసుకోవాలని తన సోదరుడు సతీష్‌ను తాత్కాలికంగా వాచ్‌మెన్‌గా నియమించుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున సతీష్ వసతి గృహం పెంట్‌హౌజ్‌లో పైకప్పు రాడ్డుకు ఉరేసుకున్నాడు. ఉదయం గమనించిన విద్యార్థులు వార్డెన్ మాధురికి సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సతీష్ స్వగ్రామంలో అప్పులు చేశాడని, ఆ ఒత్తిడిలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని సోదరుడు సంపత్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తాం..

- సీతాఫల్‌మండి ప్రభుత్వ స్కూల్‌లో ఆందోళనలు
- నిరసనలో పాల్గొన్న బీజేపీ నేతలు
- రెండోరోజూ చెట్టకిందే తరగతులు



పాఠశాల భవనం కూల్చివేయంతో శుక్రవారం చెట్లకిందే కొనసాగిన విద్యార్థుల తరగతులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో పాఠశాల భవనం కూల్చివేత వ్యవహారంలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులు శుక్రవారం రెండవరోజు కూడా కొనసాగాయి. శుక్రవారం కూడా పాఠశాల ఆరుబయట చెట్ల నీడనే ఉపాధ్యాయులు తరగతులను నిర్వహించారు. మరోవైపు బీజేపీ నాయకులు పాఠశాల భవనాన్ని సందర్శించి పాఠశాల భవనాన్ని కూల్చివేయడంపై నిరసన వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల తరగతులు కొనసాగుతున్నాయి. కొత్త భవన సముదాయం నిర్మాణం కోసం రూ.29.75 లక్షల నిధులు విడుదలైన నేపథ్యంలో పాత భవనాలను నేలమట్టం చేయడం అనివార్యమైంది.

- జూనియర్, డిగ్రీ కళాశాలల తరగతి గదుల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ భవనాలను చూపించిన మీదట సదరు భవనాలను నేలమట్టం చేశారు. పాఠశాలల తరగతులను సమీపంలోని ఓయూ మోడల్ స్కూల్‌కు మార్చాలన్న ప్రతిపాదనలు అమలుకు నోచుకోకముందే పాఠశాల భవనాన్ని నేలమట్టం చేయడం వివాదాస్పదమైంది.

సెలవు రోజున కూల్చేశారు..

- కూల్చివేతకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కాంట్రాక్టర్ కూల్చివేత పనులు చేపట్టాడని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. వెనుకవైపు ఒక బ్లాకు గోడలు కూలుస్తామని చెప్పిన కాంట్రాక్టర్ మొత్తంగా రెండు బ్లాకుల కిటికీలు, దర్వాజాలు పీకేసి భయంకర పరిస్థితులు తయారు చేశారని చెప్పారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. పలువురు టీచర్లు మాట్లాడుతూ ప్రయోగశాలలు, తరగతి గదులన్నింటినీ ధ్వంసం చేశారన్నారు. ప్రస్తుతం విద్యార్థులు పరీక్షలకు సమాయత్తం అవుతున్న తరుణంలో విద్యార్థులు తరగతి గదులు, మూత్రశాలలు అందుబాటులో లేకుండా చేయడం బాధాకరమన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తాం..

- పరీక్షల సమయంలో వందలాది మంది విద్యార్థులను రోడ్డున పడేసిన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నగర నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, ప్రభుగుప్త, శారదా మల్లేశ్, కనకట్ల హరి నేతృత్వంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి నిరసన వ్యక్తం చేశారు.



పాఠశాల కూల్చివేతతో ఇబ్బందులు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

- ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. విద్యార్థులను ఎండాకాలం, పరీక్ష సమయంలో ఇబ్బందులకు గురిచేసిన వారందరిపై చర్యల నిమిత్తం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చొరవ తీసుకుని విద్యార్థులకు ప్రత్యామ్నాయ వసతి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, పిల్లల తల్లి తండ్రులతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం గొప్ప సేవ



బీకేగూడ పార్కు వద్ద భోజనాన్ని వడ్డిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆకలితో ఉన్నవారికి కడుపునిండా భోజనం పెట్టడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమం అని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న మిత భోజన కేంద్రం, చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలువురికి భోజనం వడ్డించిన మంత్రి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో రెండు నెలలకు పైగా ఉచితంగా భోజనం వడ్డించే కేంద్రాన్ని 12 సంవత్సరాలుగా నిర్వహిస్తుండటం పట్ల నిర్వాహకులను అభినందించారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదన్నారు. శ్రీనివాస సమాజ సేవా సమితి అధ్యక్షుడు పార్థసారథి, ఇతర కమిటీ సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ పార్థసారథి, మానిక్ పటేల్, ప్రసాద్, సహదేవ్‌గౌడ, రజనీరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేందర్‌సింగ్, రాజేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోడలకాలనీలో..

మానవ సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మోడల్‌కాలనీ కమాన్ వద్ద అన్నదాన కేంద్రం, చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మోడల్‌కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, బుచ్చిబాబు, మణెమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిలో ఉన్నత విద్యదే కీలక పాత్ర



సదస్సుకు హాజరైన అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: దేశ సుస్థిర అభివృద్ధిలో ఉన్నత విద్యదే కీలకపాత్ర అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఓయూ దూరవిద్య ఆడిటోరియంలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉన్నత విద్య, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో రెండో రోజు విద్యారంగానికి చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా ప్రొ.శ్రీనివాస్, విశ్రాంత అధ్యాపకులు ప్రొ.ఎస్.అశోక్, అధ్యాపకులు చలమల వెంకటేశ్వర్లు, రమణచారి, మురళీధర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన



వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న రాయల సేవా సమితి ప్రతినిధులు

అమీర్‌పేట: క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఛాతి వైద్యాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయల సేవా సమితి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధికి చాలా మంచి మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. లక్షణాలు కలిగి ఉన్న వారు వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సకాలంలో చికిత్స చేయించుకుంటే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని వివరించారు. హెల్త్ ఇన్స్‌పెక్టర్ రమేష్, సేవా సమితి అధ్యక్షుడు ఆర్.సి.కుమార్, విజయశ్రీ, అమరేశ్వరి, నాగరేఖ, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో పరిచయమై.. రూ.36,500 టోకరా

అడ్డగుట్ట: ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ అమ్మాయిని నమ్మి మోసపోయిన వ్యక్తి రూ.36,500లు ఆమెకు సమర్పించుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం మేరకు. ఈస్ట్ మారేడుపల్లికి చెందిన చంద్రకుమార్(75)కు ఫేస్‌బుక్‌లో ఓ అమ్మాయి పరిచయమైంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం అతడి వాట్సాప్ నంబర్ కూడా అడిగి తీసుకుంది. అనంతరం, వీడియో కాల్ చేసి మాట్లాడింది. మరుసటి రోజు ఫోన్ చేసి వీడియో కాల్ రికార్డ్ చేశానని, దాన్ని మార్ఫింగ్ చేసి అన్ని సోషల్ మీడియాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించి రూ. 36.500 ఫోన్ పే చేయించుకుంది. గురువారం చంద్రకుమార్‌కు మళ్లీ ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో చేసేదేమి లేక అతను శుక్రవారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అపరిచితులతో వీడియో కాల్స్ మాట్లాడి మోసపోవద్దని సీఐ ఎల్లప్ప ప్రజలకు సూచించారు.

కంటోన్మెంట్‌లో పీడీ పర్యటన



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సదరన్ కమాండ్ పీడీ పర్యటన, చిత్రంలో బోర్డు అధికారులు

కంటోన్మెంట్: డిఫెన్స్ ఎస్టేట్స్ సదరన్ కమాండ్ ప్రిన్సిపల్ డైరెక్టర్ కేజేఎస్ చౌహాన్ శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో పర్యటించారు. తొలుత బోర్డు కార్యాలయానికి వచ్చిన ఆయన సీఈఓ మధుకర్ నాయక్, ఇతర అధికారులతో భేటీ అయ్యారు. అనంతరం జింఖానా, బైసన్ పోలో, పికెట్ గార్డెన్, దోబీ ఘాట్, హస్మత్‌పేట ట్రెంచింగ్ గ్రౌండ్‌లను అధికారులతో కలిసి సందర్శించారు. ఇటీవలే బోర్డు ఎన్నికల ప్రక్రియ అర్ధంతరంగా రద్దు కావడం, జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీన ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో ప్రిన్సిపల్ డైరెక్టర్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. నిధుల లేమితో దేశవ్యాప్తంగా సుమారు 50 కంటోన్మెంట్‌లో దివాళా తీసినట్లుగా గణాంకాలు తెలుపుతున్నాయి. ఆయా కంటోన్మెంట్‌లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోసం కేంద్రాన్ని అర్థించడమే ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యంలో ఇటీవలే 46 కంటోన్మెంట్‌లకు కేంద్రం గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు మంజూరు చేసింది. దీనికి తోడు దేశంలోని వివిధ కంటోన్మెంట్‌ల ఆర్థిక పరిస్థితి ఎంతమాత్రమూ ఆశాజనకంగా లేదని, ఆయా కంటోన్మెంట్‌లలో కొత్తగా ఉద్యోగాల నియామకాలు నిలిపివేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో పీడీ పర్యటన స్థానికంగా నిధుల సమీకరణ, వనరుల సద్వినియోగం లక్ష్యంగానే సాగినట్లు తెలుస్తోంది. ఇక పీడీ శుక్రవారం నాటి పర్యటనలోనూ బోర్డు ఆధీనంలోని ఖాళీ స్థలాల సందర్శన కూడా ఈ కోణంలోనే సాగినట్లు సమాచారం. మొత్తానికి కంటోన్మెంట్ ఆర్థికంగా నిలదొక్కుకునే క్రమంలో ఉన్న అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆర్మీ సర్వీసు చార్జీల బకాయిలు చెల్లిస్తే కంటోన్మెంట్ బోర్డు ఆర్థిక కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని బోర్డు అధికారులు భావిస్తున్నారు. ఈ పర్యటనలో పీడీని కలిసిన స్థానిక మిలటరీ స్టేషన్ కమాండర్, కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్‌తో ఈ ప్రస్తావన తెచ్చినట్లు సమాచారం. దీనికి స్థానిక మిలటరీ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

సమస్యలు ప్రస్తావించిన స్థానిక నేతలు

ఒకటో వార్డు పెన్షన్‌లైన్‌లోని ఫైజాన్ స్కూలు, జామియా మసీదుకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి స్థలం కేటాయించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, పీడీ చౌహాన్‌ను కోరారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇక ఏడోవార్డు గాంధీ కమ్యూనిటీ హాలు ఆవరణలో కొనసాగుతున్న డంపింగ్ యార్డును తొలగించాలని స్థానిక బీజేపీ నేత కేబీ శంకర్రావు కోరారు. ఈ మేరకు పీడీని కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రియురాలు దూరమైందని యువకుడి ఆత్మహత్య

అమీర్‌పేట: ప్రియురాలు దూరమైందన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం భద్రాది కొత్తగూడెం జిల్లా మధస్‌పల్లి దమ్మాపేటకు చెందిన పైడి భానుప్రకాష్(25) అదే గ్రామంలో ఓ యువతిని ప్రేమించాడు. యువతి తల్లిదండ్రులకు విషయం తెలియడంతో ప్రకాష్‌ని పిలిచి మందలించారు. మరోసారి యువతితో మాట్లాడనని రాతపూర్వకంగా రాయించుకున్నారు. మనస్థాపానికి గురై గత నెల 25వ తేదీన నగరానికి వచ్చి వెంగళరావునగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. 23వ తేదీన బుధవారం తెల్లవారు జామున టవల్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వచ్చి ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరిపి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. సోదరుడు పైడి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రంజాన్ మాసంలో ఇబ్బందులు లేకుండా..

- ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు
- డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్



చిలకలగూడ ఈద్గా మైదానంలో పర్యటిస్తున్న డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్

బన్సీలాల్‌పేట్: రంజాన్ మాసంలో ఉపవాసాల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని చిలకలగూడ ఈద్గా మైదానాన్ని ఆయన సందర్శించారు. అక్కడ రంజాన్ ఏర్పాట్లు పరిశీలించారు. రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసే మసీదు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీహెచ్‌ఎంసీ, వీధిదీపాలు, పారిశుధ్యం, జలమండలి తగిన విభాగాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ముస్లింలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రావణ్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, జహంగీర్, నీలా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్లకు ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్స్‌పై హర్షం

లాలాపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లను సర్వీసెస్ 302లోకి తీసుకువచ్చి ప్రిన్సిపాల్స్‌గా ప్రమోషన్స్ అవకాశం కల్పించినందుకు తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవోపై ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దాదాపు 11 సంవత్సరాల సుదీర్ఘకాల పోరాట ఫలితంగా ఈ అవకాశం దక్కిందన్నారు. దీంతో పాటుగా ఫిజికల్ డైరెక్టర్ చేంజ్ ఆఫ్ డిసిగ్నేషన్ జూనియర్ లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా మార్చాలని కోరారు. దీంతో కోసం మరింత పోరాటం చేయాల్సి ఉందన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం రూ.11,46,259

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానంలోని వివిధ ఆలయాల హుండీల ఆదాయ లెక్కింపు శుక్రవారం జరిగింది. మొత్తం 20 హుండీలకు సంబంధించి 129 రోజులకు గాను రూ.11,46,259ల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఆలయ అర్చక, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించారు.



బసంత్ సాహ్నీలో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న బసంత్ సాహ్నీ వైద్య బృందం

కంటోన్మెంట్: కృత్రిమ చికిత్స ద్వారా మహిళల్లో అరుదుగా సంభవించే మేయర్ రోకిటాన్‌స్కీ హౌసర్ (ఎంఆర్‌కేహెచ్) నుంచి ఉపశమనం కలిగించవచ్చని సికింద్రాబాద్‌లోని బసంత్ సాహ్నీ వైద్య బృందం తెలిపింది. ఆసుపత్రి డైరెక్టర్లు డాక్టర్ పద్మావతి, ప్రసాద్‌లతో పాటు ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ వాసు, డాక్టర్ భరత్, డాక్టర్ సునీత విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రతి 4,500 మహిళల్లో ఒకరికి ఎంఆర్‌కేహెచ్ సమస్య ఉంటుందన్నారు. వైవాహిక జీవితం గడపలేమనే బాధతో ఆత్మన్యూనతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అయితే అదృష్టవశాత్తూ అధునాతన లాప్రోస్కోప్ సహాయంతో సిగ్మయిడ్ వాజినో ప్లాస్టీ శస్త్ర చికిత్స ద్వారా కృత్రిమ ప్రాంతంతో ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చన్నారు. నగరంలో ఇలాంటి అరుదైన శస్త్రచికత్సంలో కేవలం 22 మాత్రమే జరగ్గా, తమ ఆసుపత్రిలోనే 7 శస్త్రచికిత్సలు చేశామన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న తమ ఆసుపత్రిలో ఈ చికిత్సకు అతి తక్కువ చార్జీలు వసూలు చేస్తున్నామని తెలిపారు. తమ వద్ద చికిత్స చేయించుకున్న ఏడుగురిలో నలుగురు వివాహం చేసుకుని సంతోషకర జీవితం సాగిస్తున్నారని వెల్లడించారు. పెద్ద పేగులోని కొంత భాగాన్ని తొలగించి కృత్రిమంగా తయారు చేసే పద్ధతిని ఉహారణలతో వైద్య బృందం వివరించింది. ఈ సమస్యతో బాధపడుతున్న మహిళలు తమను సంప్రదించి, విజయవంతంగా చికిత్స పొందవచ్చని తెలిపారు.

జనచైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇకనైనా మానుకొని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్‌బాబు డిమాండ్ చేశారు. అడ్డగుట్ట చౌరస్తాలో సీపీఎం పార్టీ నాయకులు ప్రజాచైతన్య యాత్ర పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా 33 జిల్లాల్లో ప్రజా చైతన్య యాత్రలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సీపీఎం పిలుపు మేరకు శనివారం ఉదయం 8 గంటల నుంచి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో జోన్ కమిటీ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ జోన్ నాయకులు ఆర్.మల్లేష్, మహేందర్, గోపాల్, మధు, నరసయ్య, బాలయ్య, బి.వి.చారి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

గాంధీలో గంజాయి కలకలం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో గంజాయి కలకలం సృష్టించింది. సెక్యూరిటీ సిబ్బంది వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇస్మాయిల్ అహ్మద్ తన భార్య షెహనాజ్‌ను వారం రోజుల క్రితం గాంధీ ఆస్పత్రి గైనకాలజీ విభాగంలో చేర్పించాడు. శుక్రవారం లేబర్ వార్డు ఎంట్రీ నుంచి ఆస్పత్రి లోపలకు వెళ్లేందుకు యత్నించగా, విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని సోదా చేయగా సుమారు 50 గ్రాముల గంజాయి, రెండు చిన్నపాటి హుక్కా ప్యాకెట్లు లభించాయి. తనకు గంజాయి తాగే అలవాటు ఉందని రూ.500లకు కొనుగోలు చేశానని చెప్పాడు. గంజాయితో పాటు నిందితున్ని చిలకలగూడ పోలీసులకు అప్పగించామని జీడీఎక్స్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ తెలిపారు.

మతసామరస్యంతో పండగలు జరుపుకోవాలి



చిలకలగూడ ఠాణాలో పీస్ కమిటీ సమావేశం

చిలకలగూడ: మతసామరస్యంతో అన్ని మతాలకు చెందిన పర్వదినాలు, పండగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని చిలకలగూడ సీఐ నరేష్ సూచించారు. ఠాణా ప్రాంగణంలో శుక్రవారం మసీదు, ఆలయ కమిటీ నిర్వాహకులు, మతపెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పర్వదినాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. డీజేలకు అనుమతి లేదని, ర్యాలీ, శోభాయాత్ర, ఊరేగింపులకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, చిలకలగూడ ఏసీపీ శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు ఠాణా పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మసీదు, ఆలయ నిర్వాహకులు, మతపెద్దలు, ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న లాస్య, నివేదిత, బీఆర్‌ఎస్ నేతలు

కంటోన్మెంట్: కార్ఖానా ప్రాంతంలో తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించేలా చూస్తామని దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత తెలిపారు. శుక్రవారం కార్ఖానాలో రూ.20 లక్షల ఎమ్మెల్యే నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో తాగునీటి సమస్యపై వారితో మొరపెట్టుకున్నారు. నూతనంగా వేసిన లైనులో తాగునీటి సరఫరా సరిగా లేదని, పాత లైనులోనూ మోతాదుకు సరిపడా నీళ్లు రావడం లేదని తెలిపారు. దీంతో త్వరలోనే బోర్డు ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఇక కమ్యూనిటీ హాలు నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. తమ తండ్రి సాయన్న చేపట్టిన పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయడంతో పాటు ఆయన హామీలకు అనుగుణంగా తాము పనిచేస్తామన్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ సమస్యల పరిష్కారంలో తమవంతు ప్రయత్నాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్, నారాయణ, బోర్డు మాజీ సభ్యుడు ప్రభాకర్, బీఆర్‌ఎస్ నేతలు టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్, ఎస్.సరిత, సదానంద్ గౌడ్, మురళీ యాదవ్, రమేశ్, అనిల్, నిత్యానంద్, ముస్లిం కమిటీ సభ్యులు అక్తర్, మీర్జా, మున్నాతో పాటు మహేశ్, దర్శన్, సంతోష్, రాము తదితరులు పాల్గొన్నారు.